క్లుప్తంగా

నిర్మానుష్యంగా రోడ్లు



వేసవి తాపానికి నిర్మానుష్యంగా పట్టణంలోని రోడ్లు

పొదలకూరు : ఎండలు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. పొదలకూరు ప్రాంతం వెలికొండలకు దగ్గరగా ఉండడం వల్ల ఒకటి నుంచి రెండు డిగ్రీలు అదనంగా వేసవి తాపం ఉంటుంది. దీంతో ఉదయం 11 గంటలకే రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనులు ఉన్న వారే స్వల్పంగా రోడ్లపై సంచరిస్తున్నారు. ఎండల వేడిమికి తాళలేక జనాలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. వృద్ధులు, పిల్లలు ఎండలకు బయట సంచరించవద్దని వైద్యులు వెల్లడిస్తున్నారు. అధిక సంఖ్యలో నీటిని సేవిస్తూ పండ్లు తినాలని సూచిస్తున్నారు. ఓఆర్ఎస్, కొబ్బరినీరు తాగితే మంచిదని, వడదెబ్బల నుంచి కోలుకోవచ్చని తెలిపారు. ఈ ఏడాది ఎండల వేడిమి అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ముందస్తుగా వెల్లడించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్ మొదటి వారంలోనే వేసవి తాపం పెరిగే అవకాశం ఉంది.

దుకాణాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



నెల్లూరు(బారకాసు): వ్యాపారులు విధిగా దుకాణాల వద్ద చెత్త బుట్టలను ఏర్పాటు చేసుకుని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే జరిమానా విధిస్తామని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ హెచ్చరించారు. చిన్నబజారు, పెద్దబజారులోని పండ్ల దుకాణాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులందరూ చెత్తబుట్టలను ఏర్పాటు చేసుకుని అందులోనే చెత్తను వేయాలని సూచించారు. వాటిని చెత్త సేకరణ వాహనాలు వచ్చినప్పుడు మాత్రమే అందజేయాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను పడేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం కంసాలివీధిలో డ్రైనేజీలో పూడికతీత పనులు, కోటమిట్ట, చిన్నబజార్ ప్రాంతాల్లోని మసీదుల వద్ద పారిశుధ్య పనులను పరిశీలించారు.

మధురం మురళి గానం



నెల్లూరు(బృందావనం): పురమందిరం ప్రాంగణంలో జరుగుతున్న 59వ శ్రీత్యాగరాజ స్మరణోత్సవాల్లో భాగంగా మూడోరోజు సోమవారం చెన్నైకు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు ఏఎస్ మురళి శ్రీగణపతిని సేవింప రాడటే కీర్తనతో కచేరిని ప్రారంభించి తన మధురగానంతో సంగీతప్రియులను ఓలలాడించారు. ఆయన గాత్రానికి వీవీ శ్రీనివాసరావు (వయోలిన్), ఎస్ స్కంధసుబ్రహ్మణ్యం(మృదంగం), ఏఎస్ కృష్ణ (మోర్సింగ్) వాద్య, ఆర్ శ్యామ్‌సుందర్ గాత్ర సహకారాన్ని అందించారు. స్మరణోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు హరికథ గానం, స్థానిక ఔత్సాహిక కళాకారులు గాత్ర, వీణ, వయోలిన్‌తో ఆలపించిన కీర్తనలు సభికుల హర్షధ్వానాలు అందుకున్నాయి. ఈ కార్యక్రమాలను భిక్షాటనా పూర్వక శ్రీత్యాగరాజ స్మరణోత్సవ సభ కమిటీ శాశ్వత కార్యదర్శి ఎనమండ్ర నాగదేవిప్రసాద్, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఫిడే ఎరెనా టైటిల్ సాధించిన రామ్‌లిఖిత్



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరుకు చెందిన 8వ తరగతి విద్యార్థి మాస్టర్ రామ్‌లిఖిత్ ఫిడే ఎరెనా ఇంటర్నేషనల్ టైటిల్‌ను సాధించాడు. కోవిడ్ సమయంలో ప్రపంచ చదరంగ సమాఖ్య ఆన్‌లైన్ వేదికగా ఫిడే ఎరెనా ఇంటర్నేషనల్ టైటిల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో రామ్‌లిఖిత్ సత్తా చాటి తొలిసారిగా జిల్లాకు ఫిడే ఎరెనా ఇంటర్నేషనల్ టైటిల్‌ను సాధించాడు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్‌పార్క్ రోడ్డులోని రాష్ట్ర చెస్ అసోసియేషన్ కార్యాలయంలో ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై సుమన్ రామ్‌లిఖిత్‌కు ఫిడే టైటిల్‌ను సోమవారం బహూకరించి సత్కరించారు. శిక్షణ అందించిన కోచ్ ప్రదీప్, ప్రోత్సహించిన తల్లిదండ్రులను అభినందించారు.

వెన్నుపోటుదారులకు ఓటుతో జవాబివ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు : తల్లిపాలు తాగి రొమ్ము గుద్దిన వెన్నుపోటుదారులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డికి ప్రజలు ఓటుతో జవాబివ్వాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. కోవూరు పడుగుపాడు జాతీయ రహదారి సమీపంలో నియోజకవర్గ స్థాయి గిరిజనుల ఆత్మీయ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగ మాట్లాడుతూ పేదల కోసం నిరంతరం పాటుపడేది నల్లపరెడ్డి కుటుంబం అనే విషయం ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. అక్రమంగా డబ్బు సంపాదించి, అక్రమంగా ఖర్చుపెడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డిలకు ప్రజలు అమ్ముడుపోరన్న విషయాన్ని గుర్తించుకోవాలన్నారు. గతంలో నా పక్కనే ఉంటూ నయవంచన చేసి పార్టీ మారి వెన్నుపోటు పొడిచిన వారిని ఇక జీవితంలో దగ్గరకు రానివ్వనని జొన్నవాడ కామక్షమ్మ, గంగపట్నం చాముండేశ్వరీదేవి, కుల దైవమైన వెంకటేశ్వర స్వామి సాక్షిగా చేస్తున్నట్లు తెలిపారు. వేమిరెడ్డి కుటుంబం ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండరని, వారి జీవితం ఇతర దేశాల్లోనే సాగిందని స్పష్టం చేశారు. ఇప్పటికీ అదే పరిస్థితి కొనసాగుతుందన్నారు. గత నాలుగు దశాబ్దాల నుంచి నియోజకవర్గ ప్రజలతోనే నా జీవితం సాగుతున్న విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, సొసైటీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి, ఏపీఎల్డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యులు శ్రీలత, సరోజనమ్మ, జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్లు సుబ్బారెడ్డి, సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం

• సమస్యాత్మక గ్రామాల్లో కవాతు



పోలీసులతో కలిసి కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

మనుబోలు : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని సీఐ రాంబాబు కోరారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాల్లో కేంద్ర బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. మనుబోలు, వెంకన్నపాళెం, వీరంపల్లి, మడమనూరు, ఎల్ఎన్‌పురం తదితర గ్రామాల్లో కవాతు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రశాంతమైన వాతావరణం కల్పిస్తామన్నారు. గొడవలు సృష్టించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. వారి వెంట మనుబోలు ఎస్సై అజయ్‌కుమార్ వున్నారు.

సోమిరెడ్డి మరోసారి నవ్వులపాలు



వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారితో మంత్రి కాకాణి

వెంకటాచలం: వరుస ఓటములతో దిక్కుతోచని స్థితిలో ఇవే నాకు చివరి ఎన్నికలని తిరుగుతున్న సోమిరెడ్డి తాన నిర్ణయాలతో తరచూ నవ్వులపాలవుతున్నాడు. వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు అంటూ సోమిరెడ్డి ప్రకటించుకున్న గంటల వ్యవధిలోనే మళ్లీ వారంతా వైఎస్సార్‌సీపీ గూటికి చేరుతుండటంతో సొంత పార్టీ నేతలే సోమిరెడ్డి తీరుపై తీవ్ర అసహనంతో ఉన్నారు. తాజాగా వెంకటాచలానికి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరాయని రెండు రోజుల క్రితం సోమిరెడ్డి ప్రకటించారు. అయితే వారంతా ఆదివారం రాత్రి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులో కలిసి తాము వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని చెప్పారు. సోమిరెడ్డి వ్యవహార శైలి నచ్చక వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని చెప్పడంతో వారందరికీ మంత్రి కాకాణి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

పేదరికం లేని రాష్ట్రమే జగనన్న లక్ష్యం



కొడవలూరు : మానేగుంటపాడులో ఇంటింటి ప్రచారం చేస్తున్న చలపతిరావు



పొదలకూరు : ఇంటింటి ప్రచారం చేస్తున్న పూజిత

కొడవలూరు : పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విజయం కోసం మండలంలోని మానేగుంటపాడు, ఆలూరుపాడుల్లో సోమవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మానేగుంటపాడులో ఆయన మాట్లాడుతూ పేదరికం అంతరిస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని విశ్వసించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. అందువల్లే పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారని వివరించారు. మానేగుంటపాడులో వైఎస్సార్‌సీపీ నాయకులు కారెంపూడి సుబ్బరామిరెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డి, పి.మాధవరెడ్డి, పి.జనార్ధన్‌రెడ్డి, ఐ.బాలభాస్కర్‌రెడ్డి, డి.సుధాకర్‌రెడ్డి, ఆలూరుపాడులో సర్పంచ్ రమేష్, నాయకులు నీలకంఠం శ్రీధర్‌రెడ్డి, పి.ప్రభాకర్‌రెడ్డి, పి.బాలశంకర్‌రెడ్డి, జి.హరినాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

పొదలకూరులో అభివృద్ధి పరుగులు

పొదలకూరు : మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరు పట్టణంలో అభివృద్ధిని పరుగులు పెట్టించారని ఆయన కుమార్తె పూజిత పేర్కొన్నారు. పట్టణంలోని అగచాట్లపురం, సిండికేట్ బ్యాంకు వీధి తదితర ప్రాంతాల్లో సోమవారం ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పొదలకూరు బిట్–3 సచివాలయ పరిధిలో రూ.73.35 కోట్లతో అభివృద్ధి, రూ.23.23 కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు చెప్పారు. ఎన్నో ఏళ్లుగా అగచాట్లపురం వాసుల విద్యుత్ తీగల సమస్యను మంత్రి కాకాణి పరిష్కరించినట్లు చెప్పారు. పనిచేసి ఓట్లు అడుగుతున్నామని, ప్రజలు తిరిగి గోవర్ధన్‌రెడ్డిని గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట జెడ్పీటీసీ నిర్మలమ్మ, వైస్ ఎంపీపీ సోమా అరుణ, సర్పంచ్ చిట్టెమ్మ, ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ జి.లక్ష్మీకల్యాణి, వార్డుసభ్యులు మస్తాన్, కండే వాసు, పర్వీన్, అంజాద్, నాయకులు జి.వేణుగోపాల్‌రెడ్డి, ఖాదర్, ఎం.సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో టీడీపీ నేతల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్న, ఎంపీలు విజయసాయిరెడ్డి, బీద మస్తాన్‌రావు

కోవూరు : నియోజకవర్గ టీడీపీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు రామంజి వంశీ ఆ పార్టీకి రాజీనామా చేసి రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయిరెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. కోవూరులో జరిగిన గిరిజన సభ కార్యక్రమంలో వంశీతో పాటు మరికొందరు వైఎస్సార్‌సీపీలో చేరారు. టీడీపీలో కుట్రలు, కుతంత్రాలకు విసిగిపోయి వైఎస్సార్‌సీపీలో చేరామని వారు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం కృషి చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీ బీద మస్తాన్‌రావు, డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ముత్తుకూరు మండలంలో మంగళవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ప్రచారంలో భాగంగా పోలంరాజుగుంట, డమ్మాయపాళెం, నారికేళపల్లి పంచాయతీల్లో ప్రచారం చేస్తారని వెల్లడించారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

పొదలకూరు : మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ సుబ్బరాయుడు అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ సోమవారం తెలిపారు. ప్రధానంగా గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడిపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఎక్కడైనా తాగునీటి ఇబ్బందులు ఉంటే సభ దృష్టికి తీసుకురావాల్సిందిగా సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ తదితరులు హాజరు కావాల్సిందిగా కోరారు.

'హంస' నూతన కార్యవర్గం ఎన్నిక



ఇందుకూరుపేట: హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) ఇందుకూరుపేట తాలుకా నూతన కార్యవర్గ ఎన్నిక సోమవారం జరిగింది. ఇందుకూరుపేట సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యశాఖ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు అరికొండ హరిబాబు, మహిళా విభాగం రాష్ట్ర గౌరవ చైర్మన్ ఆర్.ఇందిర, జనరల్ సెక్రటరీ శ్రీనివాసులు పర్యవేక్షణలో ఎన్నిక జరిగింది. తాలుకా అధ్యక్షురాలిగా జి.అరుణ రాణి, అసోసియేటెడ్ ప్రెసిడెంట్‌గా ఏవీ రమేష్, జనరల్ సెక్రటరీగా వరలక్ష్మి, ట్రెజరర్‌గా మహేష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఇస్మాయిల్ పలువురు ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, వి.రమణారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



మంటల్లో కాలిపోయిన వస్తువులు

మనుబోలు : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైన ఘటన మండలంలోని గురివిందపూడి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. బాధితుని కథనం మేరకు.. గ్రామానికి చెందిన కంటెపల్లి సుబ్రహ్మణ్యం రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. రాత్రి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో ఫ్రిజ్ నుంచి ఉన్నట్లుండి పొగలు అలుముకుని మంటలు వ్యాపించాయి. దీంతో ఇంట్లో ఉన్న టీవీ, ఎయిర్ కూలర్, దుస్తులు, నిత్యావసర సరుకులు, స్టీల్ సామగ్రి అగ్నికి ఆహుతయ్యాయని, దీంతో రూ.లక్ష మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు వాపోయారు.

4న ఉచిత కంటి వైద్యశిబిరం

నెల్లూరు(అర్బన్): ఈ నెల 4న విశ్రాంత ఉద్యోగులకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఐ లక్ష్మీనారాయణ, వెంకయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురమందిరంలోని వర్ధమాన సమాజం హాల్లో ఉదయం 9 గంటల నుంచి జరిగే కంటి వైద్యశిబిరంలో సుశీల నేత్రాలయ డాక్టర్ సుధాకర్ కంటి పరీక్షలు చేస్తారన్నారు. కంటి శుక్లాల ఆపరేషన్లు అవసరమైన వారికి ఈహెచ్ఎస్, ఆరోగ్యశ్రీ కింద ఎలాంటి ఖర్చులేకుండా చేస్తారన్నారు. విశ్రాంత ఉద్యోగులతో పాటు పట్టణ ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సహకార వ్యవస్థ బలోపేతానికి కృషి



సొసైటీ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న అధికారులు

• పైలట్ ప్రాజెక్ట్‌గా పడుగుపాడు సహకార సొసైటీ

కోవూరు : సహకార వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో రెండు సొసైటీలను ఎంపిక చేసిందని, అందులో పడుగుపాడు సొసైటీ ఉందని జిల్లా సహకార శాఖాధికారి గుర్రప్ప అన్నారు. కోవూరులోని శాంతినగర్‌లో ఉన్న పడుగుపాడు సహకార పరపతి కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పడుగుపాడు సహకార సొసైటీ పరిధిలో రుణాల రికవరీ బాగుందని, ముఖ్యంగా హౌసింగ్ రుణాల విషయంలో డాక్యుమెంట్ పరిశీలన పారదర్శకంగా ఉండాలన్నారు. ప్రస్తుతం సొసైటీ పరిధిలో 500 మెట్రిక్ సామర్థ్యంతో నాలుగు గోదాములు పూర్తయిందని, వాటిని సివిల్ సప్లైస్ శాఖకు అద్దెకు ఇచ్చే ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్ రసూల్, ఆడిటర్ సుబ్బారెడ్డి, సొసైటీ సీఈఓ సిబ్బంది పాల్గొన్నారు.

సినీతారల సందడి



శ్రద్ధాదాస్‌కు జ్ఞాపిక బహూకరిస్తున్న కళాశాల చైర్మన్

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న శ్రీవెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం సినీతారలు సందడి చేశారు. పారిజాత పర్వం చిత్ర ప్రామోషన్‌లో భాగంగా నటులు శ్రద్ధాదాస్, చైతన్యరావు, వైవా హర్ష, డైరెక్టర్ సంతోష్ సినిమా ట్రైలర్‌ను ప్రదర్శించి విద్యార్థులతో మాట్లాడారు. సినిమా ఆద్యంతం ఉత్కంఠ భరితంగా, హాస్యభరితంగా ఉంటుందని చెప్పారు. ఈనెల 19న సినిమా విడుదల అవుతుందని, ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా సినీతారలతో విద్యార్థులు సెల్ఫీలు తీసుకున్నారు. అనంతరం చిత్ర బృందాన్ని కళాశాల చైర్మన్ డాక్టర్ గుణశేఖర్ శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు.

వృద్ధులకు రోగ నిరోధకశక్తి పెంచేలా చర్యలు



కోవూరు : మాట్లాడుతున్న టీబీ నియంత్రణాధికారి ఖాదర్‌వలి



కొడవలూరు పీహెచ్‌సీలో సమీక్షిస్తున్న ఖాదర్‌వలి

కోవూరు : 60 ఏళ్లు దాటిన వృద్ధులకు కూడా రోగ నిరోధక శక్తిని పెంచేందుకు బీసీజీ(బాసిల్లాస్ కాల్మెట్ గురిన్) వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎయిడ్స్, క్షయ, టీబీ నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానంగా బీసీజీ వ్యాక్సినేషన్ ఇప్పటివరకు చిన్న పిల్లలకు మాత్రమే వాడుతున్నామని, వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా బీసీజీ వ్యాక్సిన్ వేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా దీనిని గర్భిణులు, బాలింతలు, హెచ్ఐవీ బాధితులకు వేయడం లేదన్నారు. తొలుత ఆయన సీహెచ్‌సీలో ఉన్న ప్రయోగశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ల్యాబ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ విజేత, వైద్యులు వెంకటాచలపతి గౌడ్, సలావుద్దీన్, పెంచలయ్య పాల్గొన్నారు.

క్షయ నియంత్రణలో సిబ్బంది పాత్ర భేష్

కొడవలూరు: క్షయ నియంత్రణలో వైద్య సిబ్బంది పాత్ర భేష్ అని జిల్లా క్షయ నియంత్రణాధికారి ఖాదర్‌వలి పేర్కొన్నారు. కొడవలూరు పీహెచ్‌సీని సోమవారం ఆయన సందర్శించి క్షయ, కుష్టు వ్యాధులపై సిబ్బందితో సమీక్షించారు. క్షయ, కుష్టులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించడంలో సిబ్బంది చురుకైన పాత్ర పోషించారని కొనియాడారు. అనంతరం నార్తురాజుపాళెం, గుండాలమ్మపాళెం హెల్త్ క్లినిక్‌లను సందర్శించి వైద్య సేవలందిస్తున్నారా లేదా పరిశీలించారు. సిబ్బంది సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.రామకృష్ణ, జి.బాలచంద్రబాబు, క్షయ, కుష్టు డివిజనల్ అధికారులు సత్యనారాయణ, నరసారెడ్డి, సీహెచ్ఓ సోమశేఖర్, హెచ్ఏలు షఫీ ఉద్దీన్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



ముత్తుకూరు : సచివాలయ కార్యదర్శికి రాజీనామాలు సమర్పిస్తున్న వలంటీర్లు



తోటపల్లిగూడూరు : స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్న వలంటీర్లు

ముత్తుకూరు : సంక్షేమ పథకాలు ప్రజలకు అందించే అవకాశం లేని వలంటీర్ బాధ్యతలు అనవసరం అంటూ మండలంలోని నారికేళపల్లి సచివాలయ పరిధిలోని దమ్మాయపాళెనికి చెందిన వలంటీర్లు ఆందోళన వెలిబుచ్చారు. సచివాలయ పరిధిలోని పది మంది వలంటీర్లు సోమవారం పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు తమ రాజీనామాలు సమర్పించారు. రాబోయే ఎన్నికల్లో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విజయం కోసం పనిచేస్తామని ప్రకటించారు.

తోటపల్లి పంచాయతీలో..

తోటపల్లిగూడూరు : మండలంలోని తోటపల్లి పంచాయతీకి చెందిన వలంటీర్లు సోమవారం స్వచ్ఛందంగా తమ ఉద్యోగాలకు రాజీనామాలు చేశారు. ఈ మేరకు పంచాయతీ పరిధిలో పనిచేసే ఎనిమిది మంది వలంటీర్లు తమ రాజీనామా లేఖలను పంచాయతీ కార్యదర్శి శంకర్‌ప్రసాద్‌కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా గ్రామంలో ప్రజలకు సేవలందించామన్నారు. అయితే తొలి నుంచి వలంటీర్ వ్యవస్థపై ప్రతిపక్ష నేతలు అక్కసు వెళ్లగక్కడం ఎంతో బాధించిందన్నారు. తమను పింఛన్లు పంపిణీ చేయవద్దు అనడం దారుణమని, దీనివల్ల ఎంతో మంది వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతారన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వెల్ఫేర్ అసిస్టెంట్‌కు రాజీనామా ఇస్తున్న వలంటీర్

ఇసుకపాళెంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని ఇసుకపాళెం సచివాలయం సీ–1 క్లస్టర్ పరిధిలో వలంటీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న కె.కిరణ్‌కుమార్ సోమవారం రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖను వెల్ఫేర్ అసిస్టెంట్ యువరాజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థపై ఎలక్షన్ కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అందుకు నిరసనగా రాజీనామా చేశానని తెలిపారు. ప్రజలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వారి ముంగిటకు చేర్చుతున్న తమపై టీడీపీ ఉద్దేశపూర్వకంగా కక్ష సాధింపు చర్యలు చేపడుతోందన్నారు.

ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేయాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీ సీఎండీ సంతోషరావు, జిల్లా కలెక్టర్ హరినారాయణన్ ఆదేశాల మేరకు ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ప్రతిఒక్క పోలింగ్ కేంద్రాన్ని సంబంధిత విద్యుత్ అధికారులు తనిఖీ చేసి విద్యుత్ సరఫరాకు సంబంధించిన నివేదిక అందజేయాలని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆదేశించారు. నెల్లూరు నగరం, రూరల్ పరిధిలో సోమవారం ఆయన పర్యటించారు. పోలింగ్ కేంద్రాలు, విద్యుత్‌ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేసి సూచనలు చేశారు. ఆయన వెంట ఇండస్ట్రీయల్ విద్యుత్ సెక్షన్ కార్యాలయ ఏఈ లక్ష్మీనారాయణ, సిబ్బంది ఉన్నారు.